

ఎన్టీపీసీ కార్మికులకు కాంగ్రెస్ అండ 4లో..

కాంగ్రెస్‌తో ప్రజలకు ఒరిగేదేమీ లేదు 4లో..

ముగిసిన నామినేషన్ల పర్వం

● 63 మంది అభ్యర్థుల నుంచి స్వీకరణ ● చివరి రోజు 14 మంది దాఖలు.. ● నేడు పరిశీలన..



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి గురువారం మధ్యాహ్నం 3 గంటల నాటికి నామినేషన్ల పర్వం ముగిసింది. ఈ నెల 18వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయడంతో అదేరోజు నుంచి నామినేషన్లు దాఖలు ప్రారంభం అయ్యాయి. మున్నెన్నడూ లేని విధంగా ఈ దఫా ఎన్నికల్లో పోటీ చేసేందుకు చాలా మంది అభ్యర్థులు ఆసక్తికనబరిచారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాల్లో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 63 మంది అభ్యర్థులు 109 సెట్లలో నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీలు మినహా ఇతర పార్టీలకు చెందిన అభ్యర్థులు సైతం నామినేషన్లు వేశారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి గడ్డం వంశీకృష్ణ, భారత రాష్ట్ర సమితి నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, భారతీయ జనతా పార్టీ నుంచి గొమాసే శ్రీనివాస్‌తో పాటు సీనియర్ నాయకుడు సోగాల శ్రీనివాస్ కూడా నామినేషన్ దాఖలు చేశారు. పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా డెమోక్రటిక్, ధర్మ సమాజ్ పార్టీ, అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్, బహుజన్ సమాజ్ పార్టీ, సోషలిస్టు పార్టీ ఇండియా, యువ తరం పార్టీ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా, రాష్ట్రీయ మానవ పార్టీ, బహుజన ముక్త్ పార్టీ, మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీల నుంచి అభ్యర్థులతో పాటు స్వతంత్రులు నామినేషన్లు వేశారు. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన అభ్యర్థులు బీ ఫారాలను సమర్పించారు. బీజేపీ అభ్యర్థి గొమాసే శ్రీనివాస్‌కు బదులు మరొక అభ్యర్థిని బరిలో నిలిపి అతడికి బీ ఫారం ఇస్తారని ప్రచారం జరిగింది. ఎట్టకేలకు గొమాసే శ్రీనివాస్‌కు బీ ఫారం అందజేశారు. అయితే సబ్‌స్ట్యూట్ అభ్యర్థి సోగాల కుమార్ పేరును ఆ పార్టీ బీ ఫారంలో చేర్చింది. ఏదేని సాంకేతిక కారణాల వల్ల గొమాసే శ్రీనివాస్ నామినేషన్ పత్రాలు పరిశీలనలో కొట్టుడు పోతే ఎస్ కుమార్ బరిలో ఉండే విధంగా బీ ఫారంలో ఆయన పేరును చేర్చారు.

చివరిరోజు చాలా మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. మధ్యాహ్నం 3 గంటలలోపు కలెక్టరేట్ లోపలికి అనుమతించి ఆ వెంటనే గేటు మూసి వేశారు. ఒక్క నిమిషం ఆలస్యంగా కరీంనగర్‌కు చెందిన బహుజన్ సమాజ్ పార్టీ నాయకుడు మాతంగి హన్మయ్య ఆ పార్టీ తరపున పోటీ చేయడానికి నామినేషన్ వేసేందుకు వచ్చారు. కాళ్లు మొక్కబోయినా కూడా సమయం అయిపోయిందని ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పెద్దపల్లి తహసీల్దార్ రాజ్‌కుమార్ లోపలికి అనుమ తించలేదు. ఐదు నిమిషాలు ఆలస్యంగా బెల్లంపల్లికి చెందిన డాక్టర్ దాసరి శ్రీకాంత్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు రాగా, ఆయనను కూడా లోపలికి అనుమతించలేదు. గడువులోపు వచ్చిన అభ్యర్థుల్లో కొందరు తమ నామినేషన్ ప్రక్రియ ముగిసే వరకు రాత్రి 9 గంటల వరకు కలెక్టరేట్‌లోనే వేచి ఉండాల్సి వచ్చింది.



నామినేషన్ వేస్తున్న బీజేపీ అభ్యర్థి గొమాసే శ్రీనివాస్

నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు..

1. కొప్పుల ఈశ్వర్ (భారత రాష్ట్ర సమితి)
2. గడ్డం వంశీకృష్ణ (కాంగ్రెస్)
3. గొమాసె శ్రీనివాస్ (భారతీయ జనతా పార్టీ)
4. అక్కపాక తిరుపతి (స్వతంత్ర)
5. దూడ మహిపాల్ (స్వతంత్ర)
6. దుర్గం రాజ్‌కుమార్ (స్వతంత్ర)
7. కొంకటి లింగమూర్తి (బీఆర్ఎస్ రెబల్)
8. గవ్వల శ్రీకాంత్ (స్వతంత్ర)
9. లింగాల లచ్చయ్య (స్వతంత్ర)
10. మేకల అక్షయ్ కుమార్ (స్వతంత్ర)
11. జాడి ప్రేమ్ సాగర్ (స్వతంత్ర)
12. మోతె నరేష్ (స్వతంత్ర), (పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా డెమోక్రటిక్)
13. కట్కూరి సందీప్ (కాంగ్రెస్ రెబల్), (స్వతంత్ర)
14. దుర్గం సమ్మయ్య (స్వతంత్ర)
15. ఆర్నకొండ రాజు (స్వతంత్ర)
16. గడ్డం మారుతి (స్వతంత్ర)
17. రాముల కార్తీక్ (స్వతంత్ర)
18. జుమ్మిడి గోపాల్ (స్వతంత్ర)
19. అంబాల మహేందర్ (స్వతంత్ర)
20. జనగామ నరేష్ (స్వతంత్ర)
21. ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్ (స్వతంత్ర)
22. దాగం సుధారాణి (స్వతంత్ర)
23. మంద రమేష్ (ధర్మ సమాజ్ పార్టీ)
24. గడ్డల వినయ్ కుమార్ (స్వతంత్ర)
25. బొట్ల చంద్రయ్యలు (స్వతంత్ర)
26. తాళ్లపల్లి నరేష్ (స్వతంత్ర)
27. రాచర్ల రాజేశం (స్వతంత్ర)
28. ఇరికిల్ల రాజేష్ (స్వతంత్ర)
29. సొల్లు రంజిత్ (స్వతంత్ర)
30. చిలుక ఆనంద్ (యువతరం పార్టీ)
31. అంబోజు సుమలత (అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్)
32. ఇరుకుల్ల రాజనర్సయ్య (బహుజన్ సమాజ్ పార్టీ)
33. ములకల కనకయ్య (సోషలిస్టు పార్టీ ఇండియా)
34. ఇరుగురాల భాగ్యలక్ష్మి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా)
35. నూకల నవీన్ (స్వతంత్ర)
36. నీరటి శంకర్ (స్వతంత్ర)
37. కుర్మ మహేందర్ (స్వతంత్ర)
38. మోటం రవీందర్ (స్వతంత్ర)
39. బూడిద తిరుపతి (స్వతంత్ర)
40. కాశి సతీష్ కుమార్ (స్వతంత్ర)
41. చందనగిరి శ్రీనివాస్ (స్వతంత్ర)
42. పెగడపల్లి రాజనర్సు (స్వతంత్ర)
43. మామిడిపల్లి బాపయ్య (స్వతంత్ర)
44. జాడి బాల్ రెడ్డి (స్వతంత్ర)
45. దుర్గే ఈశ్వర్ (స్వతంత్ర)
46. దాగం శ్రీనివాస్ (స్వతంత్ర)
47. కంది చందు (రాష్ట్రీయ మానవ పార్టీ)
48. ఎస్ కుమార్ (భారతీయ జనతా పార్టీ) డమ్మీ అభ్యర్థి
49. ఎం వేణుగోపాల్ (బహుజన ముక్త్ పార్టీ)
50. కె శేఖర్ (స్వతంత్ర)
51. దుర్గం రాములు (స్వతంత్ర)
52. మేకల తిరుమల (మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ)
53. చొప్పదండి భవాని (కాంగ్రెస్)
54. దేవి లక్ష్మీనర్సయ్య (స్వతంత్ర)
55. దుర్గం సంతోష్ (ప్రజారాజ్య సమితి పార్టీ)
56. రామ్ చందర్ నీచకోల (దళిత బహుజన పార్టీ)
57. జూపాక కిరణ్ (స్వతంత్ర)
58. పంతకాల శ్రీనివాస్ (స్వతంత్ర)
59. పగిడి జనార్దన్ (స్వతంత్ర)
60. వాసర్ల నతనియల్ (స్వతంత్ర)
61. పులికపాక రాజ్‌కుమార్ (స్వతంత్ర)
62. ములుగు వెంకటేష్ (న్యూ ఇండియా పార్టీ)
63. కొమ్ము జగదీష్ (స్వతంత్ర)

ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలి

- అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మంథని, ముత్తారం, ఏప్రిల్ 25: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ నిర్వాహకులకు సూచించారు. గురువారం మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గంగాపురి, మంథని ఏఎంసీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, అలాగే ముత్తారం మండలం మచ్చుపేట, లక్కారం గ్రామాల్లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను ఏసీ శ్యామ్ ప్రసాద్‌లాల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో 17శాతం తేమ కలిగిన వరి ధాన్యాన్ని వెనువెంటనే తూకం వేసి రైస్ మిల్లులకు తరలించాలన్నారు. అలాగే కేంద్రాల్లో కొనుగోలు, ట్రాన్స్‌పోర్టు వివరాలను సంబంధిత రిజిష్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. రైతుల ధాన్యం కొనుగోలు, ట్రాన్స్‌పోర్టు వివరాలను త్వరితగతిన ట్యాబ్ లో నమోదు చేయాలన్నారు. వేసవి తీవ్రత ఎక్కువ ఉన్నందున రైతులు, హమాలీలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా కేంద్రం నిర్వాహకులు, రైతులు, లారీ డ్రైవర్లు, రైస్ మిల్లుల యజమానులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కేంద్రాల్లో ఎలాంటి గన్నీ కొరత లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఆయన వెంట డీఎం శ్రీకాంత్, ఆర్డీవో హనుమానాయక్, తహసీల్దార్ రాజయ్య, ఆర్ఐ రాజిరెడ్డి, సహకార సంఘం కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్‌లు ఉన్నారు.

కమిషనరేట్‌లో సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్ ఏర్పాటు



సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్‌లో పోస్టులను పరిశీలిస్తున్న సీపీ

కోల్‌సిటీ, ఏప్రిల్ 25: సోషల్ మీడియాలో వ్యక్తిగత చట్ట వ్యతిరేక పోస్టులు పెట్టే వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇందుకు గాను రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ప్రత్యేకంగా సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్(ఎస్ఎంటీసీ)ను పెట్టారు. గురువారం రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ట్విట్టర్, ఫేస్‌బుక్, వాట్సాప్‌ల్లో రాజకీయ నేతలను టార్గెట్‌గా చేసుకుని, మతాన్ని, మతానికి సంబంధించిన ప్రముఖులను టార్గెట్‌గా చేసుకుని పోస్టులు పెడుతున్నారని, ఓ వర్గాన్ని కించపరుస్తూ పోస్టుచేసినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రీతిలో పుకార్ల ప్రచారం చేసినా జైలుకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. అలాంటి వారికి జైలు శిక్ష, జరిమానాతోపాటు కేసు తీవ్రతను బట్టి జీవితఖైదు పడే అవకాశం కూడా ఉంటుందన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే ముందు, వచ్చిన పోస్టులను ఫార్వర్డ్ చేసేముందు అవి నిజామా, కాదా అని ఆలోచించుకోవాలన్నారు. 24గంటల పాటు సోషల్ మీడియా పోస్టులపై నిరంతర నిఘా ఉంటుందని, మత ఘర్షణలు జరిగేలా, లా అండ్‌ఆర్డర్ సమస్యలు సృష్టించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. లేనిపోని అబద్దపు పుకార్లను సృష్టించి పోస్టులు పెట్టే వారిపై మానిటరింగ్ సెల్ నిఘా ఉంటుందన్నారు. కొందరు ఐపీ అడ్రస్‌లు మార్చి ఏమార్చే ప్రయత్నాలు చేస్తున్నారని, వారిని కూడా వదలమన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఇన్‌స్పెక్టర్ ముత్తిలింగయ్య, ఎస్ఐ రాజమణి, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీతోనే సామాజిక న్యాయం..

- పెద్దపల్లి బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే

పెద్దపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే సామాజిక న్యాయం జరుగుతుందని, కాంగ్రెస్ పార్టీ మాదిగలు, నేతకాని కులస్తుల పట్ల వివక్ష చూపుతున్నదని, పార్టీకి టికెట్‌ను వివేక్ కుటుంబానికి అమ్ముకుందని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే ఆరోపించారు. గురువారం ఆయన సిర్పూర్‌కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు తదితరులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడుతూ చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, తనకు బీజేపీ టికెట్ రాకుండా ఉండేందుకు ప్రయత్నాలు చేశాడని ఆరోపించారు. 40ఏళ్ల నుంచి ఈ ప్రాంతాన్ని వెంకటస్వామి కుటుంబం రాజకీయ, సామాజిక దోపిడీకి పాల్పడుతున్నదని అన్నారు. వెంకటస్వామి ఏబీసీడీ వర్గీకరణకు వ్యతిరేకమని, మాదిగలపై వివక్ష చూపుతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా సామాజిక న్యాయం పాటించడం లేదని, రాష్ట్రంలో 3 స్థానాలను ఎస్సీలకు కేటాయిస్తే ఒక్క మాదిగకు గానీ, నేతకానికి గానీ టికెట్ ఇవ్వలేదన్నారు. సామాజిక న్యాయం నరేంద్రమోదీతోనే సాధ్యమన్నారు. తాను స్థానికుడిని, ఇతర ప్రాంతం నుంచి దోపిడీ చేసేందుకు వచ్చిన వివేక్ కుటుంబాన్ని తరిమికొట్టాలని గొమాసే శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, పార్టీ నాయకులు బల్మూరి అమరేందర్‌రావు, వనిత తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 25: దేశం అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ నామినేషన్ సందర్భంగా గురువారం పెద్దపల్లి పట్టణం వ్యవసాయ మార్కెట్ నుండి జెండా కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే హరీష్ బాబు జెండా వద్ద ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాని మోదీ 10ఏళ్ల కాలంలో అవినీతిరహిత పాలన అందించారని గుర్తుచేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, కాసిపేట లింగయ్య, శ్రీదేవి, గొట్టిముక్కుల సురేష్ రెడ్డి, పినింటి రాజు, శిలారపు పర్వతాలు, తంగెడ రాజేశ్వర్ రావు, కావేటి రాజగోపాల్, పల్లె సదానందం, మేకల శ్రీనివాస్ యాదవ్, పర్శ సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు. ర్యాలికి ముందు ఇరువర్గాల మధ్య పెద్దఎత్తున ఘర్షణ చోటు చేసుకుంది. గుజ్జుల వర్సెస్ దుగ్యాల అనుచరుల మధ్య జరిగిన వాగ్వాదం పరస్ప దాడుతు చేసుకునే దాకా వచ్చింది. ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు దాడి దిగడంతో పలువురికి కార్యకర్తలకు గాయాలయ్యాయి. అగుజ్జుల రామకృష్ణారెడ్డి రథంపై మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంతో వివాదం తలెత్తింది. దీంతో మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణా రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు దుగ్యాల ప్రదీప్ కుమార్ అనుచురులు గొడవకు దిగారు.

ఎన్నికల నివేదికలను సకాలంలో సమర్పించాలి

- పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు రావీష్ గుప్తా



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు

పెద్దపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నివేదికలను సకాలంలో సమర్పించాలని, ఫ్రీ అండ్ ఫెయిర్ ఎన్నికల నిర్వహణకు అధికారులు సమన్వయంతో పని చేయాలని పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు రావీష్ గుప్తా అన్నారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివిధ విభాగాలు చేసే కార్యక్రమాల నివేదికలను సకాలంలో సమర్పించాలన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో తుది ఓటర్ జాబితా రూపొందించి ఓటర్ స్లిప్పులను పంపిణీ చేయాలని, ఓటర్ స్లిప్పుల పంపిణీ పురోగతికి సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు అందజేయాలని, పట్టణ, గ్రామీణప్రాంతాల్లో ప్రతి ఒక్క ఓటరుకు ముందస్తుగా ఓటర్ స్లిప్ అందేలా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో జారీ చేసిన పోస్టల్‌బ్యాలెట్ వివరాలు, వాటిలో ఎన్ని పోస్టల్ ఓట్లు నమోదయ్యాయి అనే అంశంపై ప్రతిరోజూ నివేదిక అందించాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ మెటీరియల్ తరలించేందుకు అవసరమైన వాహనాలు సన్నద్ధం చేసుకోవాలని, ముందస్తుగా రూట్ పరిశీలించాలని, పట్టణ ప్రాంతాలలో ఇరుకు సందులలో పోలింగ్ కేంద్రాలు ఉన్నాయా అక్కడికి వాహనం వెళ్లేందుకు వీలు ఉంటుందా ముందుగానే పరిశీలించుకోవాలని పేర్కొన్నారు. పోలింగ్ సమయంలో ఎన్నికల ఏజెంట్లకు సెల్ ఫోన్ అనుమతి ఉండదని, పోలింగ్ కేంద్రం వద్ద ఏజెంట్లు ఓటర్లతో సంభాషించడానికి వీలులేదని, దీనిపై పోలింగ్ సిబ్బందికి తగిన సమాచారం ఆదేశాలు జారీచేయాలని ఎన్నికల పరిశీలకులు సూచించారు. పోలీస్ పరిశీలకులు మాట్లాడుతూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే దిశగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు సమీర్ నైరంతర్యా మాట్లాడుతూ అభ్యర్థుల ప్రచార ఖర్చుల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని అన్నారు. స్టాటిక్ సర్వేలెన్సు, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలన్సు, వీడియో వ్యూయింగ్, అకౌంటింగ్ బృందాలు వారికి కేటాయించిన విధులను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి చేతన, పెద్దపల్లి అదనపు కలెక్టర్లు జే.అరుణశ్రీ, శ్యామ్ ప్రసాద్ లాల్, జగిత్యాల, మంచిర్యాల అడిషనల్ కలెక్టర్ లు, రెవెన్యూ డివిజన్ అధికారులు బి గంగయ్య, హనుమా నాయక్, ఏసిపిలు, నోడల్ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి కాంగ్రెస్, బీజేపీ చేసిందేమీ లేదు

- జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్



కొప్పుల ఈశ్వర్ తరపున నామినేషన్ దాఖలు చేస్తున్న పుట్ట మధు

పెద్దపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఈ రాష్ట్రానికి కాంగ్రెస్, బీజేపీ చేసిందేమి లేదని, బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి జరిగిందని, అనేక సంక్షేమ పథకాలు అమలయ్యాయని, తెలంగాణ కోసం ఉండేది బీఆర్ఎస్ పార్టీ అని జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. గురువారం బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ తరుపున రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. అనంతరం మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో ఉండే కార్యకర్త నుంచి మొదలుకుని రాహుల్ గాంధి వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సిగ్గు, భయం లేకుండా ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామంటూ అబద్దాలు చెబుతూ ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. ఎన్నికలు వస్తేనే కాంగ్రెస్సోళ్లకు పథకాలు గుర్తుకు వస్తాయని, ఎన్నికల తర్వాత పథకాల అమలుకు వాయిదాలు వేస్తారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన అనేక పథకాలు అమలుచేస్తామని చెప్పిఒక్క పథకం అమలు చేయలేదన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఆ రుణమాఫీని పార్లమెంట్ ఎన్నికల్లో వాడుకుంటూ అగస్టు 15కి వాయిదా వేశాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని చెప్పి ఇప్పటివరకు ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. మంథని ఎమ్మెల్యే పోలీసులను వాడతాం, న్యాయపరంగా శిక్షలు విధిస్తామంటూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. మంథని ప్రాంతంలో ఇసుక మాఫియా ప్రభుత్వానికి డబ్బులు చెల్లించకుండా దండుకు పోతున్నదని, రేవంత్ రెడ్డి ఫొటోలతో ఇసుక లారీలు తిరుగుతున్నాయన్నారు. బియ్యం, స్క్రాప్ దందా జరుగుతున్నా పట్టించుకునే వారు లేరని అన్నారు. పైగా బీఆర్ఎస్‌ను బదనాం చేస్తున్నారని, కాంగ్రెస్ పథకాలను నమ్మి మోసపోయామని ప్రజలు చెబుతున్నారని కొప్పుల ఈశ్వర్ బ్రహ్మాండమైన మెజారిటీతో గెలుపొందనున్నారని జడ్పీ చైర్మన్ అన్నారు. జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలో దౌర్జన్యాలు పెరిగి పోయాయని, సింగరేణి క్వార్టర్లను కూలగొట్టి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి కార్మికుల పొట్ట గొడుతున్నారని, తక్షణమే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలను ఆపాలన్నారు. 26 వేల మంది సింగరేణి కార్మికులు కొప్పుల ఈశ్వర్ పక్షాన ఉన్నారని, వాళ్లు 2 లక్షల మంది ఓటర్లను ప్రభావితం చేస్తారని తెలిపారు. కొప్పుల గెలుపు తథ్యమని చందర్ అన్నారు. ఈ సమావేశంలో నారాయణదాస్ మారుతి, తదితరులు పాల్గొన్నారు.

పేదింటి 'సిరి' ఆదర్శం..

- రెండు కిడ్నీలు పాడైనా పట్టుదలతో చదువులో రాణింపు
- ఇంటర్‌లో 927 మార్కులతో ప్రభుత్వ కళాశాల విద్యార్థిని ప్రతిభ



తల్లిదండ్రులతో విద్యార్థిని సిరి

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 25: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నా చదువుకోవాలన్న బలమైన సంకల్పంతో ఆమె చదువుల్లో రాణిస్తున్నది ఈ పేదింటి సిరి. రెండు కిడ్నీలు పాడైనా మొక్కవోని పట్టుదలతో ఇటీవల విడుదలయిన ఇంటర్ ఫలితాల్లో 927 మార్కు సాధించింది కూనారపు సిరి ఆదర్శమైంది. ఎన్టీపీసీ కృష్ణానగర్‌కు చెందిన కూనారపు పోశం-వెంకటలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పోశం సెంట్రింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్ద కూతురు కూనారపు సిరి ఆరు ఏళ్ళుగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నది. ఎనిమిది నెలల క్రితం నుంచి రెండు కిడ్నీలు పూర్తి చెడిపోవడంతో రెండు వారాలకు ఒకసారి డయాలసిస్ చేయించుకుంటున్నది. పూర్తిగా మంచానికే పరిమితమైన సిరికి చదువుపై ఉన్న శ్రద్ధకు గోదావరిఖని శారదానగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాఠ్యాంశాల వివరాలను తెలియజేయడంతో తోటి విద్యార్థుల సహకారంతో సెల్‌ఫోన్‌లో సందేహాలను నివృత్తి చేసేవారు. దీంతో రెండు కిడ్నీలు పాడైనా కూడా ఇంటర్ ఫలితాల్లో సీఈసీ విభాగంలో 927 మార్కులతో సాధించి ఆదర్శంగా నిలిచింది.

రైతు వేదిక తలుపులు చోరీ

మానకొండూర్, ఏప్రిల్ 25: మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో గల రైతు వేదిక తలుపులను పగుల కొట్టి బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. గ్రామానికి దూరంగా నిర్మించడం కాపలాదారుడు లేకపోవడం వల్ల గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారని రైతులు తెలిపారు.





సినిమా వార్తల కోసం

www.andhrajyothy.comను క్లిక్ చేయండి





210 గ్రాముల గంజాయి స్వాధీనం

జమ్మికుంట, ఏప్రిల్ 25: జమ్మికుంట పట్టణంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకుల నుంచి 210గ్రాముల గంజాయి ప్యాకెట్లను గురువారం పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు. పాత గ్రేన్ మార్కెట్ సమీపంలో ఇద్దరు యువకుల కదలికలను గమనించిన ప్ర జలు పోలీస్‌లకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకు న్న పోలీస్‌లు పిట్టల మహేష్ వద్ద 100గ్రాములు, లింగాల శ్రీనివాస్ కార్తీక్ వద్ద 110గ్రాముల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేశామని పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

అనుమతి లేకుండా మట్టి తరలిస్తే చర్యలు

- తహసీల్దార్ అనుపమ

శంకరపట్నం, ఏప్రిల్ 25: ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్స్‌కావేటర్ నిర్వాహకులను తహసీల్దార్ అనుపమ హెచ్చరించారు. మండలంలోని కొత్తగట్టు గ్రామంలో గురువారం అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు తహసీల్దార్ అనువమ, ప్రత్యేకాధికారి, ఎంపీఈవో శ్రీవాణి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి మట్టి తరలిస్తే ఎక్స్‌కావేటర్‌ను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని ట్రాక్టర్ డ్రైవర్లు, జేసీబీ యజమానులను హెచ్చరించారు. అనంతరం లోయకుంట కట్టకు గండి పెట్టిన రైతును పిలిచి తహసీల్దార్ అనుమప మాట్లాడారు. కట్ట గండి పుడ్చాలని ఆదేశించారు. గండి పూడ్చకుంటే జరిమానా విధిస్తామని సదరు రైతును హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సెమినార్

గణేశ్‌నగర్, ఏప్రిల్ 25: ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల కరీంనగర్‌లో టెక్నాలజీస్ ఫర్ అకౌంటింగ్ ఫైనాన్స్ అనే అంశంపై విద్యార్థులకు ఒకరోజు సెమినార్‌ని కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ హరికాంత్ ముఖ్య అతిథిగా హాజరై హాజరై మాట్లాడారు. కామర్స్ విద్యార్థులు సబ్జెక్టు నాలెడ్జ్‌తో పాటు సబ్జెక్టుకు సంబంధించిన టెక్నాలజీని నేర్చుకుంటే భవిష్యత్తులో మంచి అవకాశాలను అందుకోవచ్చన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రామకృష్ణ మాట్లాడుతూ కామర్స్ విద్యార్థులు టెక్నాలజీని ఉపయోగించుకోవాలని చెప్పారు. ప్రతి విషయంపై అవగాహన కలిగి ఉంటే భవిష్యత్తులో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు. సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి రాజయ్య, వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ ఏ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.


















ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ఎన్నికల పరిశీలకుడు అమిత్ కటారియా

కరీంనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి అమిత్ కటారియా ఆదేశించారు. గురువారం ఆయన జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులతో ఎన్నికల నియమావళిపై సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలాసత్పతి ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం అమిత్ కటారియా మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యే వరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు.

పార్లమెంట్ నియోజకవర్గ పోలీస్‌శాఖ పరిశీలకుడు మనీష్ చౌదరి మాట్లాడుతూ ఎక్కడ ఏ ఫిర్యాదు వచ్చినా వెంటనే స్పందించి తగినచర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని, నగదు తరలింపుతోపాటు ఓటర్లను ప్రలోభపెట్టే వస్తువులపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. కరీంనగర్‌లోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో ఉదయం 11.30 నుంచి 12.30 మధ్యలో ఏవైనా ఫిర్యాదులపై ప్రజలు నేరుగా కలువవచ్చని సూచించారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు అశ్వినీకుమార్ పాండే మాట్లాడుతూ అధికారులు అభ్యర్థుల ఎన్నికల వివరాలను పకడ్బందీగా నమోదు చేయా లని సూచించారు. అభ్యర్థుల వ్యయంపై ప్రత్యేక దృష్టిసారించాలని, ఎక్కడ నిబంధన ఉల్లంఘించినా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


సమావేశంలో పాల్గొన్న అమిత్ కటారియా, కలెక్టర్ పమేలాసత్పతి

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా జిల్లా యంత్రాంగం తరపున పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, 42 మండలాలు ఉన్నాయని తెలిపారు. మొత్తం 23.83 లక్షల జనాభా, 17.88 లక్షల ఓటర్లు ఉన్నారన్నారు. పురుషులు 8,73,952, మహిళా ఓటర్లు 9.14 లక్షలు ఉన్నారని చెప్పారు. పీడబ్ల్యూడీ ఓటర్లు 41,718 మంది, 85 సంవత్సరాలు దాటిన ఓటర్లు 13,780 మంది ఉన్నారన్నారు. వీరికి ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. పార్లమెంట్ పరిధిలో 2,194 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, అన్ని వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. 1,484 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. పోలింగ్‌కు 13,635 మంది అధికారులు, సిబ్బందిని వినియోగిస్తున్నామని చెప్పారు. 288 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నాయని, ఇక్కడ ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు ప్రత్యేక దృష్టిపెట్టామని అన్నారు. సివిజిల్ యాప్ ద్వారా 106 ఫిర్యాదులు రాగా 73 ఫిర్యాదులను పరిష్కరించామని కలెక్టర్ తెలిపారు. సువిధ కింద అనుమతుల కోసం 142 దరఖాస్తులు రాగా 102 అనుమతులు ఇచ్చామని, 15 ప్రాసెస్‌లో ఉన్నాయని చెప్పారు. నామినేషన్ల ప్రక్రియలో భాగంగా 36 మంది అభ్యర్థులు 62 నామినేషన్లను వేశారని అన్నారు. తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు 7.95 కోట్ల నగదును పట్టుకున్నామని తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న 23.71 లక్షల విలువగల మద్యాన్ని సీజ్ చేశామని చెప్పారు. రెండు కిలో 342 గ్రాముల గంజాయిని పట్టుకున్నామని అన్నారు. 14 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నగదు సామగ్రి తరలించకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 75శాతం పోలింగ్ నమోదైందని, ఈసారి పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేకంగా కృషిచేస్తున్నామని చెప్పారు. 46వేల మంది కొత్త ఓటర్లు నమోదయ్యారని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు 8,552 ఈవీఎంలను సిద్ధం చేస్తున్నామని, ఎక్కడైనా ఇబ్బంది వస్తే వెంటనే వాటి స్థానంలో ఈవీఎంలను ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

● పటిష్ట బందోబస్తు ఏర్పాటు: సీపీ అభిషేక్ మహంతి

పార్లమెంట్ ఎన్నికలకు పోలీసుశాఖ తరపున పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి తెలిపారు. ఎన్నికల పరిశీలకులకు పోలీసుశాఖ తరపున తీసుకుంటున్న చర్యలను వివరించారు. నగదు, సామగ్రి తరలించకుండా ప్రత్యేక తనిఖీలు చేస్తున్నామని అన్నారు. సమావేశంలో హన్మకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్, సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్, జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ భాషా, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, కరీంనగర్ అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవో కె మహేశ్వర్, సిరిసిల్ల అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, హన్మకొండ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ, కాజీపేట, హుస్నాబాద్ ఏసీపీలు తిరుమల్, సతీష్, ఆర్డీవోలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

డీజే సౌండ్ సిస్టం సీజ్.. ఇద్దరిపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 25: మండలంలోని వెంకటాపూర్‌లో ఎలాంటి అనుమతి లేకుండా డీజే సౌండ్ సిస్టం ఏర్పాటు చేసి నృత్యాలు చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించడంతో డీజే సిస్టంను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ గురువారం తెలిపారు. గ్రామంలోని యాదవ కాలనీలో రోడ్డుకు అడ్డంగా డీజే సౌండ్ సిస్టంను ఉంచి కొందరు యువకులు పాటలపై నృత్యాలు చేస్తున్నారని సమాచారంతో హెడ్ కానిస్టేబుల్ శంకర్ ఆధ్వర్యంలోని సిబ్బంది అక్కడికి చేరుకున్నారని పేర్కొన్నారు. అనుమతి లేకుండా డీజే సౌండ్ సిస్టంను ఎలా పెట్టారని ప్రశ్నించిన పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని, సిరిసిల్ల పట్టణానికి చెందిన డీజే సౌండ్ సిస్టం యజమాని వంగరి సుధాకర్, ఆపరేటర్ అంకెల మహేష్‌లపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో రహదారులపై రైతులు ధాన్యం ఆరబెట్టడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టకూడదని ఎస్సై రమాకాంత్ అన్నారు.

కొండగట్టులో ముమ్మరంగా పారిశుధ్య పనులు


పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

మల్యాల, ఏప్రిల్ 25: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలు ముగియడంతో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ ఆధ్వర్యంలో ఉత్సవాలకు ఒక్క రోజు ముందు నుంచే దిగువ కొండగట్టు, కొండపైన పారిశుధ్య పనులను ప్రారంభించారు. ఉత్సవాలు బుధవారం ముగియగా గురువారం కూడా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 200మంది సిబ్బంది, దేవస్థానం సిబ్బందితో కలిసి పారిశుధ్య పనులు చేపట్టారు. ఉత్సవాల సందర్భంగా పారిశుధ్య పనులను డీపీవోతో పాటు జిల్లాలోని పలువురు ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు నిరంతరం పర్యవేక్షించారు. గతంలో కన్న ఈసారి పారిశుధ్య పనులకు తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇచ్చినట్లు పలువురు పేర్కొంటున్నారు. గ్రామ ప్రత్యేకఅధికారి స్వాతి, స్థానిక పంచాయితీ కార్యదర్శి స్వప్న తదితరులు ఈసందర్భంగా తమకు సహకరించిన కలెక్టర్, డీపీవో ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైర్లపై టార్పాలిన్ పడి కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

● రూ. 35 లక్షల ఆస్తి నష్టం
● సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన ఎస్ఈ


వైర్లపై పడ్డ టార్పాలిన్ కవర్

కథలాపూర్, ఏప్రిల్ 25: రైతులు వడ్లపై కప్పుకున్న టార్పాలిన్ గాలికి కొట్టుకు వచ్చి వైర్లపై పడడంతో బొమ్మెన సబ్ స్టేషన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. ఈ సంఘటనలో సుమారు 35 లక్షల రూపాయల ఆస్తి నష్టం సంభవించిందని ఏఈ జమీల్‌పాషా తెలిపారు. తక్కళ్ళపల్లి శివారులో ఉన్న వరద కాలువ పక్కన ప్యాక్స్ కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం కొనుగోళ్ళు సాగిస్తున్నారు. ఆప్రాంతంలో రైతులు వడ్లు ఆరబెట్టుకుంటున్నారు. ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటుండంతో ధాన్యంపై పాలథీన్ కవర్లు కప్పుకున్నారు. అయితే గురువారం ఒక్కసారిగా గాలి వీయడంతో పాలథీన్ కవర్ లేచి పక్క నే ఉన్న 11కేవీ వైర్లపై పడి చుట్టుకుంది. దీంతో సబ్‌స్టేషన్‌లో ఉన్న 5ఎంవీఏ సామర్థ్యం ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ వేడిగా మారింది. పూర్తిగా ఆయిల్‌తో పాటు వైండింగ్ కాలిపోవడం వల్ల సుమారు 35 లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఈ సత్యనారాయణ బొమ్మెన చేరుకుని సబ్‌స్టేషన్‌ను పరిశీలించి మరమ్మ తుల కోసం చర్యలు చేపట్టారు. విద్యుత్ సరఫరాకు కొంత మేర ఇబ్బంది తలెత్తే అవకాశాలు ఉన్నట్టు అధికారులు తెలిపారు. డీఈఈ రఘుపతి, ఎంఆర్‌టీ ఏఈలు, మెట్‌పల్లి డీఈఈ తిరుపతి ఉన్నారు.


సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ

నంబర్ ప్లేట్‌లేని వాహనాలు నడిపితే చర్యలు


వాహనాలను చూపిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వరరావు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 25: నంబర్ ప్లేట్ లేని వాహనాలను నడిపితే చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని వెల్లుల్ల గ్రామంలో ఎస్సై చిరంజీవి తన సిబ్బందితో నంబర్ ప్లేట్ లేకుండా రోడ్డుపై నడుపుతున్న 32 వాహనాలను పట్టుకున్న వాటిని గురువారం పరిశీలించారు. సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు తమ బండికి సంబంధించిన అన్నిరకాల పత్రాలను తమ వెంట ఉంచుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతి వాహనానికి నంబర్ ప్లేట్‌లను తప్పకుండా ఆర్‌టీవో నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై అంజేయులు, జనార్ధన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆరు వాహనాలు సీజ్

కొడిమ్యాల, ఏప్రిల్ 25: మండలంలోని దొంగలమర్రి పోలీస్ చెక్ వద్ద గురువారం రాత్రి కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ ఆద్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నెంబరు లేని, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ చేసిన ఆరు వాహనాలను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాజన్న గోశాలలో మెగా వైద్య శిబిరం

- కమిషనర్ ఆదేశాల మేరకు కదిలిన అధికార యంత్రాంగం



గోశాలను పరిశీలిస్తున్న రాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ మంజువాణి, కోడెలకు వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్యాధికారులు

వేములవాడ రూరల్, ఏప్రిల్ 25: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలోని కోడెల సంరక్షణకు అధికార యంత్రాంగం కదిలింది. రెండు రోజుల క్రితం రాజరాజేశ్వరస్వామి వారి సన్నిధికి వచ్చిన దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు గోశాలను సందర్శించారు. కోడెల సంరక్షణకు ఆలయ అధికారులు చేపట్టిన చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కోడెలపై ఆలయ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కోడెలకు సరైన పోషకాహారాన్ని, పచ్చిగడ్డి, పల్లిపిండి లాంటి వాటిని అందించాలని అధికారులను ఆదేశించారు. గోశాల పరిస్థితిని కమిషనర్ సీఎంవో దృష్టికి తీసుకెళ్లారు.

ఈ నేపథ్యంలో సీఎంవో ఆదేశాల మేరకు రాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ మంజువాణి రాజన్న ఆలయ కార్యనిర్వహణ అధికారి కృష్ణప్రసాద్‌తో కలిసి గురువారం తిప్పాపూర్‌లోని గోశాలను సందర్శించారు. ఆమె పర్యవేక్షణలో కోడెలకు వైద్యశిబిరం నిర్వహించారు. కోడెలు బలహీనంగా ఉండడానికి గల కారణాలను తెలుసుకోవడానికి క్షేత్రస్థాయిలో వైద్య పరీక్షలు జరిపి అవసరమైన కోడెలకు వ్యాక్సినేషన్, గాలికుంటు టీకాలు వేశారు. గోశాలలో ఉన్న 1093 కోడెలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఉన్నతాధికారిణి జ్యోతి, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి కొమురయ్య, పశువైద్య సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కులకు ఉపయోగించే గోవుల సంరక్షణపై అధికార యంత్రాంగంలో కదలిక రావడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



లవన్ కుమార్(ఫైల్), మంతెన గంగు(ఫైల్)

గొల్లపల్లి, ఏప్రిల్ 25: గొల్లపల్లి నల్లగుట్ట వద్ద జగిత్యాల-ధర్మారం ప్రధాన రహ దారిపై ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని అతివేగంగా వచ్చి కారు ఢీకొట్టిన దుర్ఘటనలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు గురువారం మృతి చెందాడు. ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. బుగ్గారం మండలం శెకల్ల గ్రామానికి చెందిన బంక లవన్‌కుమార్ (20) అనే యువకుడు ఓ న్యూస్ ఛానల్‌లో ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం పనులనిమిత్తం గొల్లపల్లి నల్లగుట్ట నుంచి జగిత్యాల వైపు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. అదే సమయంలో జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి అతివేగంగా వస్తున్న ఏపీ01 ఏపీ 4748 అనే నంబరు గల షిఫ్ట్ డిజైర్ కారు ముందు ఉన్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న లవన్ కుమార్ ద్విచక్ర వాహనాన్ని అతివేగంతో ఢీకొట్టగా లవన్ కారు బోనట్ పైనుంచి ఎగిరి రోడ్డుపై పడ్డాడు. ఈ దుర్ఘటనలో లవన్ కుమార్ తలకు బలమైన దెబ్బ తగలడంతో తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు వైద్య చికిత్సల నిమిత్తం 108 అంబులెన్స్‌లో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యచికిత్స చేయిస్తున్నారు. పరిస్థితి విషమించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. దీంతో ఉన్న ఒక్క కొడుకు తమ కళ్లెదుటే తిరిగిరాని లోకాలకు తరలివెళ్లడంతో మృతుడి తల్లిదండ్రులు రోదనలు మిన్నంటాయి. మృతుడి మేనమామ దావన్‌పల్లి లింగన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. అతివేగం, నిర్లక్ష్యంగా కారు నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు ఎస్సై వివరించారు.

● యువకుడి నేత్రదానం..

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన బంక లవన్‌కుమార్ రెండు నేత్రాలను పుట్టెడు దుఃఖంలోను తల్లిదండ్రులు దానం చేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. తమ ఉన్న ఒక్కగానొక్క కొడుకు తమ కళ్లెదుటే మృతిచెంది కడుపుకోత మిగిల్చినా తను పోతూ ఇతరుల కు నేత్రదానం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపడం కొంత ఉపశమనాన్ని కలిగిస్తుందని ఈసందర్భంగా మృతుడు లవన్‌కుమార్ తండ్రి బంక వెంకటేశం బోరున విలపించారు.

● వెల్లుల్లలో వృద్ధురాలు..

మెట్‌పల్లి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన మండలంలోని వెల్లుల్ల గ్రామానికి మంతెన గంగు(62)అనే వృద్ధురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గురువారం తెలిపారు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం...వెల్లుల్ల గ్రామానికి చెందిన మంతెన గంగు భర్త మంతెన నర్సయ్య దిచక్ర వాహనంపై ఈనెల 22న ఆత్మకూర్ గ్రామంలోని శుభకార్యానికి వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి బయలు దేరారు. ఈ క్రమంలో ఆత్మకూర్ పెద్దమ్మ ఆలయం వద్ద ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టడంతో మంతెన గంగు తలకు బలమైన గాయాలు తగిలాయి. దీంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆసపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న మంతెన గంగు బుధవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు భర్త మంతెన నర్సయ్య ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ


పగలకొట్టి ఉన్న బీరువా తలుపులు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 25: మండలంలోని వెల్లుల్ల గ్రామంలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి విలువైన ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లినట్లు గురువారం పోలీసులు తెలిపారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పొంచంపల్లి లక్ష్మి భర్త గల్ఫ్‌కు వెళ్లగా తన కొడుకుతో కలిసి ఉంటుంది. బుధవారం మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట గ్రామంలోని శుభకార్యానికి తన కొడుకుతో కలిసి వెళ్లింది. తిరిగి గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటివెనుక భాగంలోని తలుపులు పగటగొట్టి చొరబడినట్లు గుర్తించింది. ఇంట్లోని బీరువాలో దాచుకున్న ఐదున్నర తులాల బంగారం, 15 తులాల వెండి, రూ. 42వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. దీంతో గ్రామంలోని పలువురికి తెలిపి పోలీసులకు సమాచారం అందించింది. సంఘటన స్థలాన్ని పోలీసులు, క్లూస్ టీం వివరాలను సేకరించారు. పొంచంపల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 25: మండలంలోని పైడిమడుగు గ్రామానికి చెందిన గౌడశెట్టి సాయిలు(48)అనే వ్యక్తి గురువారం చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సాయిలు పశువుల కాపారిగా పనిచేస్తు జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం సాయిలు గ్రామ శివారులోని వాగులో చేపలు పట్టేందుకు వెళ్లి చేపలు పడుతున్న క్రమంలో విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మృతుడికి ఇద్దకు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నాటు ఎస్ఐ తెలిపారు.

కర్రలు పడి వృద్ధురాలి మృతి

మల్యాల, ఏప్రిల్ 25: ఇంట్లో సరుగుపై గల కర్రలను తీస్తుండగా ప్రమాదవశత్తూ పడడంతో ఓ వృద్దురాలు తీవ్ర గాయాలపాలై మృతి చెందింది. ఎస్సై అబ్దుల్ రహీం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముత్యంపేట కు చెందిన మర్రి రాజేశ్వరి(80)అనే వృద్ధురాలు గురువారం తన ఇంట్లో గల కర్రలను తీస్తుంది. ఈ క్రమంలో కర్రలు రాజేశ్వరిపై పడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలి సోదరుడు ఈశ్వరయ్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

● రూ.50వేల పట్టివేత

ఎలాంటి డాక్యుమెంట్స్ లేకుండా తరలిస్తున్న నగదును పోలీసులు పట్టుకున్నారు. మల్యాలలో పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా సాయికృష్ణ అనే వ్యక్తి వద్ద ఎలాంటి రసీదులు లేని రూ.51,100 లభించగా పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

కన్నుల పండువగా చంద్ర రథోత్సవం

- ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి వారికి మొక్కులు చెల్లించుకున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో సీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులు


చంద్రరథంపై విహరిస్తున్న స్వామివారు

ఇల్లందకుంట, ఏప్రిల్ 25: కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి చేపట్టిన చంద్ర రథోత్సవం కన్నుల పండువగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం 5గంటలకు చంద్ర రథాన్ని జయజయ నామస్మరణాలతో, డప్పుచప్పుళ్లు, కోలాట నృత్యాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి రథోత్సవ కార్యక్రమం తిరుమాడ వీధుల్లో చంద్ర రథంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు స్వయంగా తాళ్లతో రథాన్ని లాగుతూ స్వామి వారిని దర్శించుకున్నారు. సుమారు గంట పాటు రథయాత్ర కొనసాగగా స్వామివారి ఊరేగింపుగా ఆలయానికి ఆరు గంటలకు చేరుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. సుమారు 20వేల మంది భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో సీఐలు కిశోర్, బొల్లం రమేశ్, ఎస్ఐలు తిరుపతి, రాజకుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


డోలు వాయిస్తున్న కళాకారులు

బీజేపీతో రాజ్యాంగానికే ప్రమాదం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

భగత్‌నగర్, ఏప్రిల్ 25: బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగానికే ప్రమాదమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణకోసం ఇండియా కూటమి పనిచేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఇండియా కూటమిలో సీపీఐ భాగస్వామ్య పక్షంగా ఉన్నందున తెలంగాణలో కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తామన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సీపీఐ రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వచ్చి తమ మద్దతు కోరారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, కాంగ్రెస్ అభ్యర్థుల కోసం సీపీఐ శ్రేణులు పని చేస్తారన్నారు. రెండోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాదం, హిందూముస్లిం మధ్య చిచ్చు పెట్టే కుట్రలు చేస్తోందన్నారు. పదిసంవత్సరాలుగా దేశ సంపదను మోదీ పెట్టుబడిదారులకు అప్పనంగా అప్పగించారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో మతోన్మాద బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. కేసీఆర్ అహంకారం తగ్గలేదని, సీఎంగా ఉన్నప్పుడే ప్రాజెక్టులు, భూసమస్యలు, ధరణి పోర్టల్‌పై అనేక సలహాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు సీపీఐ శ్రేణులను కలుపుకొనిపోతే మంచి ఫలితం ఉంటుందన్నారు. సమావేశంలో రాజన్నసిరి సిల్ల, కరీంనగర్ జిల్లా కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, గుంటి వేణు, రాష్ట్రకౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో 'అల్ఫోర్స్'కు ఉత్తమ ర్యాంకులు


టాపర్స్‌తో కలిసి విజయసంకేతం చూపుతున్న అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 25: ఐఐటీ జేఈఈ మెయిన్స్ ఫలి తాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు వివిధ క్యాటగిరీలలో జాతీయ స్థాయి అత్యుత్తమ ర్యాంకులను సాధించడం హర్షణీయమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. ఎం.హర్షిత్ 252వ ర్యాంకు, ఎ.వర్ధన్‌రావు 444, పి.మనోహర్ 466, జి.శ్రీహాస్ 503, బి.భరద్వాజ్‌నాయక్ 781, పి.చందన 1213, సత్యాఅమూల్యా 1301, సుభోద్‌చౌదరి 1367, కె.శ్రీనిధి 1562, ఎం.డి.షఫిక్ 1603, మిత్ర 1612, సిహెచ్.అనూహ్య 1632, ఏ.శివవరుణ్ 1719, ఎస్.ప్రణయ్ 1721, పి.రాహుల్ 1751, ఎం.ప్రణీత్‌రెడ్డి 1912, జె.ఉమామైత్ర 1953వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు.

ఎల్.అరుణ్‌కుమార్ 2353, సిహెచ్.సిద్దార్థ 2444, పి.రాఘవీరారెడ్డి 2510, కె.విశాల్‌రెడ్డి 2557, కె.రోహన్‌ప్రీత్ 2643, జె.హర్షవర్ధన్ 2908, జి.లహరి 2965వ ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ కీర్తిని ఇనుమడింపజేశారని అన్నారు. 1000లోపు ఐదు ర్యాంకులు, 5వేలలోపు 34, మరియు 461 మంది విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించడం విశేషమని అన్నారు. ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు ఎంపికైన విద్యార్థులకు అత్యుత్తమ అధ్యాపక బృందంచే కోచింగ్ ఇస్తామని చెప్పారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులు, అధ్యాపకులను అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో 'ట్రినిటి విద్యార్థుల అద్భుత ప్రతిభ


టాపర్స్‌తో కలిసి విజయసంకేతం చూపుతున్న ట్రినిటి చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ట్రినిటి విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరించి జాతీయ స్థాయిలో ఉత్తమమైన పర్సంటైల్‌తో పాటు ర్యాంకులు సాధించారు. జె.హానికర్ అత్యుత్తమ ర్యాంకు 48, డి.గణేశ్‌రావు 485, ఎం.చిత్రాంజలి 532, ఎ.రఘుపతి 789, ఎల్.జస్వంత్ 910, సిహెచ్.శివ 1397, ఎస్.సుమంత్ 1473, బి.వర్షితరాణి 1626, ఆర్.నిఖిల్ 2279, ఎం.ధనుంజయ్ 2464, సిమెచ్.ఆశిష్‌నాయక్ 3113, ఎ.గంగాధర్ 3289, పి.శ్రీజ 4563, జె.కీర్తి 4633, డి.దేవేందర్ 4836, ఎల్.చంద్రపతి 4883, ఎం.హిమబిందు 5210, బి.అక్షిత్‌గౌడ్ 5310, బి.సందీప్ 5685, బి.వంశీకృష్ణనాయక్ 5964, వి.శ్రీతేజ 6262 ర్యాంకులను సాధించారు.

అత్యుత్తమ ర్యాంకులను సాధించిన విద్యార్థులు కళాశాల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చక్కని ప్రణాళికతో, పరీక్షల్లో విద్యార్థులు చేస్తున్న తప్పులను ఎప్పటికప్పుడు సరిచేస్తూ అభ్యసనం పెంచడం ద్వారా సమయపాలన నేర్పిండంతో అద్భుత ఫలితాలను సాధించారని అన్నారు. ప్రతి సంవత్సరం ఎంతో మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చుతున్నామని అన్నారు.

ఎన్టీపీసీని సందర్శించిన సింగరేణి సీఎండీ


ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీఎండీ

జ్యోతినగర్, ఏప్రిల్ 25 : సింగరేణి సీఎండీ బలరాం బుధవారం రాత్రి రామగుండం ఎన్టీపీసీని సందర్శించారు. మొదటి సారిగా ఎన్టీపీసీకి వచ్చిన సీఎండీని ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు స్వాగతం పలికారు. అనంతరం సీఎండీ బలరాం 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును సందర్శించారు. దేశంలోనే అతిపెద్ద ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుగా గుర్తింపు పొందిన ప్లాంటును సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు సింగరేణి సీఎండీ అభినంఇంచారు. తరువాత ఎన్టీపీసీ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఎన్టీపీసీలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా తదితర అంశాలపై చర్చించారు. ఎన్టీపీసీకి ఎ లాంటి అంతరాయం లేకుండా బొగ్గు సరఫరా చేసేందుకు కృషి చేస్తామని సీఎండీ బలరాం అధికారులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎన్టీపీసీ జీఎం(ఆర్ఇ) అనిల్ కుమార్ వేముల, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'శ్రీచైతన్య' విజయదుందుభి


టాపర్స్‌ను అభినందిస్తున్న శ్రీచైతన్య జూనియర్ కళాశాలల చైర్మన్ రమేశ్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 25: ఐఐటీ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు వివిధ క్యాటగిరీలలో అద్భుత ర్యాంకులు సాధించినట్లు శ్రీచైతన్య జూనియర్ కళాశాలల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. పింగిలి వెన్నెల 27, రాపోలు శ్రీవాణి 601, మణిదీప్‌రెడ్డి 952, ఒ.రిత్విక 986, కె.రోహిత్ 1399, బి.హారిక 4569, ఇ.సూర్యకాంత్ 10,832, మాదవి జ్యోతిర్మయి 11,592, పి.హాసిని 14,317, కె.శ్రీనిత్ 25,121, ఎం.శ్రీవిద్య 25,539, పి.వర్షిణి 33,892 ఆల్ ఇండియా ర్యాంకులను సాధించారని అభినందించారు. జేఈఈ మెయిన్స్‌కు హాజరైన వారిలో 60శాతం మంది విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్‌కు అర్హత సాధించి శ్రీచైతన్య మరో సంచలనం సృష్టించిందన్నారు. కార్యక్రమంలో శ్రీచైతన్య కళాశాల డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్ మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధాకృష్ణ, మోహన్‌రావు, ఏజీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా: పింగిలి వెన్నెల



కళాశాల షెడ్యూల్‌ను ఫాలో అవుతూ లెక్చరర్ల సలహాలతో జేఈఈ మెయిన్స్ పరీక్షలో మంచి ర్యాంకు తెచ్చుకున్నా. కాలేజీ డీన్, లెక్చరర్ల ప్రేరణతో మెయిన్స్‌లో అద్భుత ర్యాంకు రావడానికి తోడ్పడింది. మా తల్లిదండ్రుల తోడ్పాటు కూడా ఉంది. జేఈఈ అడ్వాన్స్‌లో కూడా మంచి ర్యాంకు సాధిస్తా. భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను అవుతా.

కాంగ్రెస్ పార్టీలో చేరిన ఈర్ల కొమురయ్య

పెద్దపల్లిటౌన్, ఎప్రిల్ 25: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ తూర్పు జయప్రకాశ్‌రెడ్డి సమక్షంలో గురువారం ఈర్ల కొమురయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

చేరికలు రద్దు

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్

పెద్దపల్లిటౌన్, ఎప్రిల్ 25: గాంధీ భవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఈర్ల కొమురయ్య, మాటూరి రవిల చేరికలను జిల్లా కాంగ్రెస్ పార్టీ పక్షాన పార్టీలోకి అనుమతించడం లేదని జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని పూర్తిగా వ్యతిరేకిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారని, అలాగే అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఇతర పార్టీలో చేరి ప్రచారం చేశారని, పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించిన వీరిని జిల్లా శాఖ సమర్థించడం లేదన్నారు. వారి చేరికలు జిల్లా కాంగ్రెస్‌లో కొనసాగవని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో వేడుకలు

కాల్వ శ్రీరాంపూర్, ఏప్రిల్ 25: మండలంలోని కిష్టంపేట 2వ అంగన్వాడీ సెంటర్ సూపర్ వైజార్ సావిత్రి ఆధ్వర్యంలో గురువారం ఈసీసీఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాట్లాడుతూ నర్సరీ చదివే పిల్లలను వారి తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రంలో చదివించాలని, పిల్లల ఎదుగుదలకు, శరీర, మానసిక అభివృద్ధి కోసం పౌష్టికాహారం అందించాలని, పిల్లలను అంగన్‌వాడీ సెంటర్‌కు పంపిస్తే ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ దేవేంద్ర, ఆయా వనిత, పిల్లలు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

నగదు స్వాధీనం

పాలకుర్తి, ఏప్రిల్ 25: మండలం పరిధిలోని బసంత్‌నగర్ అడ్డరోడ్ వద్ద గురువారం బసంత్‌నగర్ ఎస్సై ఆర్ స్వామి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు.ఈ తనిఖీల్లో మహారాష్ట్రలోని గోండియా జిల్లాకు చెందిన బిశ్వదేవ్ దేవనాథ్ వద్ద 80 వేల రూపాలయలకు ఎలాంటి రశీదులు లేక పోవడంతో అట్టి నగదును స్వాదీనంచేసుకొని ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.ఈ తనిఖీల్లో రెండవ ఎస్సై శివాణి రెడ్డి,అక్కపాక రవిందర్,ఎన్నికల అధికారి షబ్బీర్ పాషా పాల్గొన్నారు.

పెద్దపల్లి టౌన్ : పెద్దపల్లి జెండా చౌరస్తా దగ్గర తనిఖీ చేస్తుండగా ఈ రాజేశం అనే వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేని రూ.2లక్షలు స్వాధీనం ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి

- డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 25: ప్రపంచ మలేరియా దినోత్సవంలో భాగంగా నిర్వహించిన మలేరియా అవగాహన ర్యాలీని గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కె. ప్రమోద్ కుమార్ ప్రాంభించారు. జిల్లా ఆసుపత్రి నుంచి ప్రాంబమైన ర్యాలీ పట్టణ వీధుల్లో తిరుగుతూ మలేరియాపై అవగాహన కల్పించారు. ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ 2030 వరకు మలేరియాను నిర్మూలించాలని వివిధ ప్రభుత్వ శాఖలను, ప్రజలను భాగసౌమ్యం చేస్తూ వివిధ కార్యాక్రమముల ద్వారా ప్రజలలో మలేరియా వ్యాధిని ఆరికట్టుటకు, దోమల నిర్మూలనకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆరోగ్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, గ్రామ పంచాయితీ సిబ్బంది సమిష్టిగా ప్రజలు ప్రతి మంగళవారం, శుక్రవారాల్లో డ్రైడ్రే పాటించాలన్నారు. ఎండ తీవ్రత 40 డిగ్రీల కంటే ఎక్కువ ఉన్నందున వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకొని వేసవికాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యాక్రమములో డా శ్రవణ్ కుమార్, డా కీర్తన, డా అభినయ్, డా రామకృష్ణ, ఉమా మహెశ్వర్, సి.హెచ్.ఒ, వీరగోని శ్రీనివాస్, ల్యాబ్ టెక్నిషియన్, ఐ.ఆర్.సి.ఎస్ ప్రతినిధి, బి.అంజయ్య, సబ్‌యూనిట్ ఆఫీసర్, టి.రాజేశం, యం.పి.హెచ్.ఇ.ఒ, ఎన్.సి.డి. కోఆర్డినేటర్‌లు తదితర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి ప్రభుత్వ ప్రాదమిక ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో గురువారం మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్లు అనుదీప్, శ్రీజలు మాట్లాడుతు దోమలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తూ దోమకాటు మూలంగా వచ్చే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ర్యాలీలో పాల్గొన్న వారు నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కాల్వ శ్రీరాంపూర్, ఏప్రిల్ 25: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ఆంగ్ల మాధ్యమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను ఏపీఎం కనుకయ్య శంకుస్థాపన చేశారు. ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య, ఓరుగంటి శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ అండ

గేట్ మీటింగ్‌లో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


పాలకుర్తిలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

జ్యోతినగర్, ఏప్రిల్ 25 : ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. గురువారం ఎన్టీపీసీ ప్లాంటు వద్ద జరిగిన ఎన్నికల ప్రచార సభలో మక్కాన్‌సింగ్ ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎన్టీపీసీ కార్మికుల కోసం జీవో 22ను అమలుచేయిస్తామన్నారు. తాము ప్రకటించిన 5 న్యాయాల్లో ముఖ్యమైన కార్మిక న్యాయాన్ని అమలుచేసి తీరుతామని తెలిపారు. రామగుండం ప్రాంతాన్ని బి కేటగిరి నగరంగా గుర్తించేలా కృషి చేస్తానని, తద్వారా కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు, బెన్‌ఫిట్లు పెరుగుతాయన్నారు. ప్రధానంగా రామగుండం కార్మికులకు సంబంధించి డిపెండెంట్ ఎప్లాయ్‌మెంట్, మెడికల్ టెస్టులు, పోలీస్ ఎంక్వైరీ, గేట్ పాసుల సమస్యలను పరిష్కరించేలా చూస్తానన్నారు. తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టులో స్థానికులకే ఉపాధి కల్పించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత ఎన్నికలలో ఎన్టీపీసీ కార్మికులు తనకు బాసటగా నిలిచి అత్యధిక మెజారిటీతో గెలిపించారని, వచ్చేనెల 13న జరిగే పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని మక్కాన్ సింగ్ కోరారు. కార్యక్రమంలో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, మేయర్ అనిల్ కుమార్, ఎన్టీపీసీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డి.ఆసిఫ్ పాషా, కార్పొరేటర్లు కొలిపాక సుజాత, మహంకాళి స్వామి, మచ్చకుర్తి రమేష్, కొలని వెంకట్‌రెడ్డి, లింగమూర్తి, తూం పద్మ, ఆంజనేయులు, మురళి, రాజేశం, రవి, నర్సింహారెడ్డి, సురేందర్, మల్లేశ్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీని భారీ మెజారిటీతో గెలిపించాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ పిలుపునిచ్చారు. మక్కాన్‌సింగ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఎన్నికల సాన్నాహక సభ జరిగింది. ఈసభలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌తో పాటు కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీలు పాల్గొన్నారు. ఈసందర్భంగా మక్కాన్‌సింగ్ మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో కాకా వెంక టస్వామి ముద్ర చెరపలేనిదని, కాకా వారసుడిగా ఎన్నికల బరిలో నిలిచిన వంశీకృష్ణను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని అన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతం మరింత అభివృద్ధి జరగాలంటే వంశీ గెలవాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని సాగనంపినట్టే దేశంలో బీజేపీని సాగనంపాలని కార్యకర్తలకు మాక్కాన్ సింగ్ పిలుపునిచ్చారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని, ఈప్రాంతంలో బొగ్గు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు కలిసి కృషి చేస్తామని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అతి తక్కువ కాలంలో అమలు చేసి చూపామని, పార్లమెంట్ ఎన్నికల తర్వాత పూర్తిస్థాయిలో ప్రజా సంక్షేమ పాలన ఉండబోతున్నట్లు మక్కాన్‌సింగ్ తెలిపారు. కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు గడ్డం వంశీ విజయానికి కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, మేయర్ అనిల్‌కుమార్, నాయకులు మారెల్లి రాజిరెడ్డి, బొంతల రాజేష్, మహంకాళి స్వామి, శంకర్‌నాయక్, సాగంటి శంకర్, దుర్గాప్రసాద్, అక్బర్‌అలీ, సత్యనారాయణరెడ్డి, తిరుపతిరెడ్డితో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకుర్తి : రానున్న పార్లమెంటు ఎన్నికలలో రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, తెలంగాణ యువతలో మేథో సంపతిని బయటికి తెచ్చేందుకు క్విజ్ ఏర్పాటు చేస్తున్నామని, టెక్నాలజీని దేశానికి అందించింది రాజీవ్ గాంధీ అని, కేంద్రంలో అధికారంలోకి రానున్నది కాంగ్రెస్ పార్టీయే నని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. గురువారం మండలంలోని జీడినగర్‌లో ఓ ప్రయివేటు ఫంక్షన్ హాలులో నిర్వహించిన పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న మక్కాన్ ప్రధాని మోడి రాహుల్ గాంధీ పట్ల అవలంబిస్తున్న వైఖరి నిరంకుషంగా ఉందని మండిపడ్డాడు. మొన్నటి వరకు అధికారంలో ఉన్నా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపెట్టి తెలంగాణ ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రజా పాలనను జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నేతలు మరోసారి ప్రజలను మోసం చేసేందుకు బస్సు యాత్రలను, పంటపొలాల వెంట తిరుగుతున్నారని బీఆర్ఎస్ నాయకులు ఎన్ని చెప్పిన తెలంగాణ ప్రజలు నమ్మేందుకు సిద్దంగా లేరని తెలిపారు.రానున్న పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల్లో పోటి చేస్తున్న గడ్డం వంశీని చేతి గుర్తుపై ఓటు వేసి బారి మెజార్టీతో గెలిపించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గడ్డం వంశీ,చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ (వెంకట స్వామి) మండలంలోని పలు గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు, యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.పార్టీలో చేరిన వారికి మక్కాన్ సింగ్ కండువాలు కప్పి పార్టీ లోకి స్వాగతించారు. అబిమానులు వంశీకి నాగలిని బహూకరించి పట్టుశాలువాలతో సన్మానించారు.

తండ్రి గెలుపు కోసం కూతురు ప్రచారం

ధర్మారం, ఏప్రిల్ 25: "నాన్న ప్రజాసేవకు అంకితమయ్యారు.. ఇరవై ఏళ్లుగా ఎమ్మెల్యేగా సేవలు చేశారు.. ప్రజల మధ్యనే ఉంటూ సమస్యలను పరిష్కరించారు.. నాన్నను ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా గెలిపించాలి" అంటూ గురువారం మండలంలోని బుచ్చయ్యపల్లి, నర్సింహుల పల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కూతురు నందిని ప్రచారం నిర్వహించారు. రెండు గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ఆమె ఓటర్లకు వివరించారు. వెంట ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, సహకార సంఘాల జిల్లా చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్, మార్కెట్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, జితెందర్ రావు తదితరులు ఉన్నారు.

కొప్పుల గెలుపు కోసం సమష్టి కృషి

ధర్మారం, ఏప్రిల్ 25: పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలని బీఆర్ఎస్ ధర్మపురి నియోజకవర్గ ఎన్నికల కో ఆర్డినేటర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ కోరారు. గురువారం ధర్మారం మండలం ఖిలావనపర్తిలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కొప్పుల గెలుపు కోసం నాయకులు ముడుపు కట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజా సమస్యలపై అవగాహన కల్గి ఉన్న వ్యక్తిగా, కార్మికునిగా పనిచేసిన కొప్పుల ఈశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కుమార్తె నందినితో పాటు ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జిల్లా సహకార సంఘాల చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్, మార్కెట్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, నాయకులు జితెందర్‌రావు, పాకాల రాజయ్య, మోహన్‌రెడ్డి, హన్‌మాన్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

కాట్నపల్లిలో బీజేపీ నేతల ఇంటింటి ప్రచారం

సుల్తానాబాద్, ఏప్రిల్ 25: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి గోమాసె శ్రీనివాస్ ను గెలిపించాలని కోరుతూ కాట్నపల్లి గ్రామంలో బీజేపీ నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌కుమార్ పిలుపు మేరకు ప్రచారం కొనసాగిస్తున్నామని, దేశ ప్రదానిగా మరోసారి నరేంద్రమోడీ ని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతిచారి, కిరణ్, దేవేందర్, శ్రీనివాస్,వెంకటేశ్, వేణు, తదితరులు పాల్గొన్నారు.



క్వార్టర్ల పక్కన ఉన్న నిర్మాణాలపై కొరడా..

గోదావరిఖని, ఏప్రిల్ 25: ఆర్‌జీ-1 ఏరియా పరిధిలో క్వార్టర్ల పక్కన ఉన్న నిర్మాణాలపై సింగరేణి కొరడా ఝుళిపించింది. ఈ మేరకు స్థానిక వంక బెండ్ దగ్గర వాటర్ ట్యాంక్ పక్కనగల సింగరేణి ఉద్యోగి తన క్వార్టర్ క్వా.నెం.డీ-439, సెక్టార్-1 క్వార్టర్‌కు ప్రక్కన ఖాళీ స్థలంలోని అక్రమ కట్టడాన్ని కూల్చివేసినట్టు ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. క్వార్టర్‌లో ఉద్యోగి పదవీ విరమణ ఉన్నందున క్వార్టర్ కంపెనికి హ్యాండ్ ఓవర్ చేసే క్రమంలో వారి క్వార్టర్‌కు పక్కన సింగరేణి స్థలంలో అక్రమ కట్టడం ఉందని గుర్తించామని, ఇందుకు స్పందించి ఉద్యోగి సింగరేణి యాజమాన్యం ఆదేశాల మేరకు తన క్వార్టర్‌కు పక్కన అక్రమంగా నిర్మించిన రేకులషెడ్‌ను వెంటనే కూల్చి వేయటం జరిగిందన్నారు. ఎవరైనా అక్రమంగా కంపెనీ ఆస్తులను ధ్వంసం చేసినా, కంపెనీ స్థలాలను ఆక్రమించినా కంపెనీ పరంగా చట్టపరమైన చర్యలను తీసుకుంటామని, ఎవరు కుడా కంపెని స్థలాలలో అక్రమ కట్టడాలు చేపట్టరాదని ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు.

బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 25: దేశంలో బీజేపీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐ కృష్ణ పిలుపునిచ్చారు. గురువారం గోదావరిఖని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో మేడే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ నాయకులు ఈదునూరి నరేష్, దుర్గయ్య, కొమురయ్య, రవికుమార్, రాజయ్య, అజెద్నెగో, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రామగిరి, ఏప్రిల్ 25: సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలు ఈనెల 29 నుంచి 25 రోజుల పాటు స్థానిక రాణిరుద్రామాదేవి క్రిడప్రాంగణంలో వాలీబాల్, ఫుట్‌బాల్, ఆర్చరీ, హాకీ క్రిడాల్లో ఉచిత వేసవి శిక్షణను కల్పించనున్నాట్లు పేర్కొన్నారు. ఈనెల 28వ తేదిలోపు పర్సనల్ విభాగంలో నమోదు చేసుకొవాలని సూచించారు.

కాంగ్రెస్‌తో ప్రజలకు ఒరిగేదేమీ లేదు

బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్


ఓదెలలో మాట్లాడుతున్న అభ్యర్థి ఈశ్వర్

ఓదెల, ఏప్రిల్ 25 : కాంగ్రెస్ 120 రోజుల పాలనతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం కూడలిలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ బీఆర్ఎస్ పాలన శైలిని ప్రజలు గమనిస్తున్నారని, వీరి పాలనపై కొద్ది రోజులకే ప్రజలు విసుగుచెందారన్నారు. కేసీఆర్ పాలనలో ఎకరం పొలం ఎండలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు, మహిళలకు అన్ని ఇబ్బందులేనని తెలిపారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థులు స్థానికులు కాదని, తాను సింగరేణి బొగ్గుగని కార్మికుల నుంచి వచ్చి ప్రజలకు పారదర్శకంగా సేవలందించానని తెలిపారు. అనంతరం బీఎస్పీకి చెందిన భోగె సదానందం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, జడ్పీటీసీ గంట రాములు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఐరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం కార్నర్ మీటింగ్‌లో బీఆర్ఎస్ లోకసభ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 100రోజుల్లో 6గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి నాలుగు నెలలు గడిచిన అమలు చేయడం లేదని ఇంకెప్పుడు అమలు చేస్తారని బీఆర్ఎస్ లోకసభ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే రైతులకు రైతు భరోసా 15వేల రూపాయలతో పాటు కింటల్ ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వకుండా మరోసారి రైతులను మభ్య పెట్టడానికి ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తామని చెప్తున్నాడని రైతులు మోసపోవడానికి సిద్ధంగా లేరన్నారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు చేపట్టాడన్నారు. పార్లమెంట్ పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉండే వాడినని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి హైదరాబాద్‌లో ఉండి వ్యాపారం చేస్తాడని, ఏదైనా అవసరం ఉంటే అందుబాటులో ఉండడన్నారు. మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రెండు పంటలకు సాగునీరు అందించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సాగునీరందక పంటలు ఎండి పోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. బీఆర్ఎస్ లోకసభ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశానికి ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, సింగిల్ విండో చైర్మన్ గజవెల్లి పురుషోత్తం, బీఆర్ఎస్ నాయకులు గొడుగు రాజకొమురయ్య, కామీడీ వెంకట్‌రెడ్డి, శిలారపు మల్లయ్య, నిదానపురం దేవయ్య, నూనేటి కుమార్ మాదాసి, చందు, రాణవేన మానస, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గోదావరిఖని : సింగరేణి కార్మికుడి బిడ్డగా అన్నీ కష్టాలు తెలిసిన నాయకుడు కొప్పుల ఈశ్వర్ అని, పార్లమెంట్ ఎన్నికల్లో కొప్పుల ఈశ్వర్‌కు ఓట్లు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గురువారం కార్పొరేషన్ పరిధిలోని 35, 36 డివిజన్‌లలో చందర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ కేసీఆర్ అమలుచేసిన సంక్షేమ పథకాలను వివరించారు. బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చందర్ అన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ కావాలని స్థానిక ఎమ్మెల్యే ఇక్కడున్న సింగరేణి క్వార్టర్లను తొలగించడం దుర్మార్గమైన చర్య అని ఆరోపించారు. ఓట్లు వేసిన గెలిపించిన ప్రజల ఇండ్లను కూల్చివేయడం ఏమిటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో రామగుండం మెడికల్ కళాశాల ఏర్పాటు చేశామని, ప్రజల సంక్షేమం కోసం పాల్పడ్డామన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పాముకుంట్ల భాస్కర్, పట్టణ అధ్యక్షుడు చెలుకలపెల్లి శ్రీనివాస్, నాయకులు కౌటం బాబు, నారాయణదాసు మారుతి పాల్గొన్నారు.

అంతర్గాం : ఎన్నికల హామీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేసిందని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గురువారం అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ గ్రామంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో చందర్ ఈ మేరకు మాట్లాడారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడిచినా నేటికీ ఆరు గ్యారంటీలను అమలు చేయలేదని ఆరోపించారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, మాజీ సర్పంచ్‌లు దర్ని రాజేష్, దబ్బెట రమ్య, కోల సంతోష్, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మంథనిరూరల్ : పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి ప్రజలను మోసం చేసి ఓట్లు దండుకోవటానికి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరును వాడుకుంటుందని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్, మంథని నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పుట్ట మధు ఆరోపించారు. మండలంలోని చిన్నఓదాల, గోపాల్‌పూర్ గ్రామాల్లో పెద్దపల్లి బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా గురువారం పుట్ట మధు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్, మిర్యాల ప్రసాద్‌రావు, పెగడ శ్రీనివాస్, తిరుపతిలు పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి..అండగా ఉంటా..

గొల్లపల్లి, ఏప్రిల్ 25 : గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన కాలంలో ఎమ్మెల్యేగా, ప్రభుత్వ చీఫ్ విప్‌గా, మంత్రిగా ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలపానని, ప్రజా సంక్షేమ పథకాల అమలులో నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో ఉంచానని, ఈ దఫా పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీగా అవకాశం ఇస్తే నిరంతరం అండగా ఉంటానని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఓటర్లను ఓటు అభ్యర్థించారు. గురువారం గొల్లపల్లి మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన స్థానిక పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం నుంచి నల్లగుట్ట వరకు స్థానిక పార్టీ శ్రేణులతో కలిసి, మహిళలు, యువతతో కలిసి భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్నర్ మీటింగ్‌లో ఆయ న పాల్గొన్నారు.

కోరం లేక మండల సభ వాయిదా

ధర్మారం, ఏప్రిల్ 25: ధర్మారం మండల సర్వసభ్య సమావేశం గురువారం కోరం లేక వాయిదా పడింది. ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి సభ్యుల కోరం లేక వాయిదా వేస్తున్నట్టు ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ ప్రకటించారు.

కన్నాలలో ఓటు హక్కుపై అవగాహన

పాలకుర్తి,ఏప్రిల్ 25: మండలం పరిధిలోని కన్నాలలో ఉపాధిహామీ పనులను ఎంపిడీవో పోల్సాని శశికళ పరిశీలించారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకిట్లు, మజ్జిగ ప్యాకిట్లను అందించారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. ఏపీవో కోమురయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.